# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 30-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **ఆధ్యాతిక పర్యాటకాన్ని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**
3. **రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**
4. **పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.**
5. **అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

=========================

అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలు బహుళ జాతి సంస్థల ప్రతినిధులతో ఈరోజు వేర్వేరుగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, పారిశ్రామిక వాడలు, డేటా కేంద్రాలు, పర్యావరణ హిత భవనాలు, డిజటల్ టౌన్ షిప్స్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. పరిశ్రమలు, మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, నగరాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమని చెప్పారు. పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో సంస్థలు కార్యకలాపాలు సాగించేందుకు సిద్ధంగా ఉండేలా ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశం ఉందని చంద్రబాబు నాయుడు వివరించారు.

-------------------------

ఆధ్యాతిక పర్యాటకాన్ని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరున్ని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, తిరుపతిలోని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిస్ట్ సర్క్యూట్‌ను అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడలలో నిర్వహించిన తరహాలో తిరుపతిలోనూ టూరిజం కాన్ క్లేవ్ ను నిర్వహిస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 32 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని వాల్మీకి సర్కిల్‌లో బస్ స్టాప్ నిర్మాణ పనులకు మంత్రి ఈరోజు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 50 లక్షల రూపాయల నిధులతో బస్ స్టాప్ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజనకు సంబందించి చేపట్టిన పనులు వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో విద్యుత్ శాఖ అధికారులతో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సౌరఫలకాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయతీల అమలుపై బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం- ఆర్డీఎస్ఎస్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తెలిపారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లాలోని పలాస – కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కాశీబుగ్గ పైవంతెన పనులను ఆయన నిన్న పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, వంతెన నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని అందిస్తామని చెప్పారు. భూములు కోల్పోతున్న రైతులతో వచ్చే నెలలో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 35 సెకన్లు

---------------------------

అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. మానవులను ముఖ్యంగా మహిళలు, చిన్నారులను అక్రమంగా తరలించి వారిని అసాంఘిక కార్యక్రమాలకు వినియోగించడాన్ని నిరోధించేందుకు, అటువంటి చర్యలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఐక్యరాజ్య సమితి 2013 నుంచి ప్రతీ సంవత్సరం జూలై 30వ తేదీన అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తోంది. మానవ అక్రమ రవాణా నుండి కాపాడబడిన బాధితులను వివక్షకు గురి చేయకుండా, బాధితుల సమస్యలను, అనుభవాలను ఆకళింపు చేసుకోవడం ద్వారా మానవ అక్రమ రవాణా అరికట్టే లక్ష్యంతో ఈ రోజుని నిర్వహిస్తున్నారు.

---------------------------

అర్హులైన రైతులందరికీ ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ- పియం కిసాన్ నిధులను జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ అంశంపై ఆయన సంబంధిత శాఖల అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, రైతులకు ఆర్థిక చేయూతను అందించే లక్ష్యంతో ప్రతి రైతుకు ఏడాదికి 20వేల రూపాయల సహాయం అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన ఇ-కెవైసి

తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో ఇ–కెవైసి, మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని సూచించారు.

---------------------------

భారత–బ్రిటన్ ల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం –ఎఫ్‌టీఏ ద్వారా బ్రిటన్‌కు ఎగుమతుల విధానం మరింత సులభతరమైందని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు పి. భాస్కర్ రావు తెలిపారు. విజయవాడలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఒప్పందంతో రాష్ట్ర వ్యవసాయ రంగానికి లబ్ధి చేకూరడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరోక్షంగా బలోపేతం కానుందన్నారు. బ్రిటన్ కు భారత్ ఎగుమతులు వృద్ధి చెందుతాయని తెలుపుతూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు 8 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2 లక్షల 16 వేల 520 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి ఇన్ ఫ్లో 2 లక్షల 66 వేల 325 క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో 2 లక్షల 82 వేల 478 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 882.80 అడుగులగా ఉందని, నీటినిల్వ సామర్థ్యం 203 టీఎంసీలుగా నమోదైందని చెప్పారు. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి పూర్తిస్థాయిలో కొనసాగుతోందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పడమటి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్ నారాయణ తెలియజేశారు.

వాయిస్…20 సెకన్లు

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 180 పాయింట్ల లాభంతో 81 వేల 518 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 48 పాయింట్ల లాభంతో 24 వేల 869 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

రాయల సీమలో సాగునీటి వనరులు పెంచడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా రాయల సీమలో పర్యటిస్తున్న ఆయన అనంతపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈ రోజు నిర్వహించిన 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో పలు అంశాలపై ప్రజలతో చర్చించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం బిజెపి కృషి చేస్తుందన్నారు. తిరుపతి, అనంతపురం వంటి ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన అవసరముందని తెలిపారు.

======================